క్లుప్తంగా

నేడు గ్రామాల్లో గడప గడపకు

అడ్డతీగల: అడ్డతీగల మండలంలోని దొరమామిడి పంచాయతీ పరిధిలోని లంగుపర్తి, కినపర్తి, కొట్టంపాలెం, గొరయ్యపేట గ్రామాల్లో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎల్లవరంలోని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఆయా గ్రామాల్లో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజాసమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వంఅమలుచేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి వివరిస్తారన్నారు.

28న వాల్మీకి జయంతి

రంపచోడవరం: మహాకవి వాల్మీకి మహర్షి జయంతిని ఈ నెల 28న ఘనంగా జరుపుకోవాలని రాష్ట్ర ఆదివాసీ హక్కుల వేదిక అధ్యక్షుడు బోండ్ల వర ప్రసాదరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. వాల్మీకి మహర్షి ప్రపంచానికి ఎంతో ఆదర్శవంతుడని అటువంటి మహానుభావుడు గిరిజనుల ఆరాధ్య దైవంగా, ప్రపంచ ప్రప్రథమ ఆదివాసీగా ప్రపంచం గుర్తించడం ఎంతో ఆనందనీయమన్నారు.

మాజీ ఎమ్మెల్యే దేముడు వర్ధంతి రేపు

కొయ్యూరు: మండలంలోని వెలగలపాలెంలో ఈనెల 26న మాజీ ఎమ్మెల్యే దివంగత గొడ్డేటి దేముడు వర్ధంతి నిర్వహించనున్నట్టు అరకు ఎంపీ గొడ్డేటి మాధవి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వతంత్ర్య సమరయోధులు అల్లూరి సీతారామరాజు, గాం గంటన్నదొర, మల్లుదొర, మగ్రి కామయ్య విగ్రహాలు ఆవిష్కరించనున్నట్టు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నేతలు, అభిమానులు తరలిరావాలని కోరారు. గొడ్డేటి దేముడు వర్ధంతిని పురస్కరించుకుని మెమోరియల్ పార్క్ వద్ద రక్తదాన శిబిరాన్ని, వైద్య శిబరాన్ని నిర్వహిస్తామన్నారు.

అన్నసమారాధనకు విరాళం



నగదు అందజేస్తున్న ఎంపీ మాధవి

కొయ్యూరు: అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, శివప్రసాద్ దంపతులు ఔదార్యాన్ని చాటుకున్నారు. పెదమాకవరంలో నిర్మిస్తున్న రామాలయం వద్ద నిర్వహించనున్న అన్న సమారాధన కార్యక్రమానికి రూ.20వేల నగదును మంగళవారం వారు అందజేశారు. త్వరలో జరిగే అన్న సమారాధన కార్యక్రమానికి హాజరు కావాలని పెదమాకవరం గ్రామస్తులు వారిని ఆహ్వానించారు. సర్పంచ్ సూరిబాబు, గ్రామపెద్దలు నూకరాజు, వెంకటేశ్, రమణ పాల్గొన్నారు.

స్ప్రేయర్ల పంపిణీ



రైతులకు స్ప్రేయర్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

వై.రామవరం: మండల పరిధిలో సుమారు 170 మంది రైతులకు 90 శాతం ప్రభుత్వ సబ్సిడీపై స్ప్రేయర్లను ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు వీరమళ్ల సుబ్బలక్ష్మి, సర్పంచ్‌లు పల్లాల బాలురెడ్డి, ముత్యాల నూకరాజు, పల్లాల రాజేశ్వరి తదితరులు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందన్నారు. ప్రభుత్వ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జేసీఎస్ మండల కన్వీనర్ కరణం కనకరాజు, నాయకులు గుడ్ల త్రిమూర్తులు, ఎం.నారాయణరావు, పి.తమ్మిరెడ్డి, తిరుపతిరెడ్డి, వీరబాబు పాల్గొన్నారు.

కోడి పందాలు, జూదాలు ఆడితే కఠిన చర్యలు

గంగవరం : కోడి పందాలు, జూదాలు ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ బి.రామకృష్ణ హెచ్చరించారు. నెల్లిపూడి గ్రామ శివారులో మంగళవారం సాయంత్రం చిత్తులాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.1,050 నగదు స్వాధీనం చేసుకున్నారు. మొల్లేరు గ్రామ శివారులో సోమవారం కోడి పందాలు నిర్వహణపై దాడి చేసి, ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని, రెండు కోడి పుంజులు, వారి నుంచి రూ 1,100 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ రామకృష్ణ చెప్పారు. గ్రామాల్లో జూదాలు నిర్వహించినా, జూద క్రీడలు ప్రోత్సహించినా అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



అరకు సంతబయలులో పూజలు చేస్తున్న భక్తులు



పెదబయలు భారీ అన్నదానంలో పాల్గొన్న భక్తులు



ముంచంగిపుట్టులో దుర్గమ్మకు పూజలు నిర్వహిసున్న భక్తులు



జి.మాడుగులలో పూజల్లో పాల్గొన్న భక్తులు



జద్దంగి స్టేషన్‌లో ఆయుధ పూజ చేస్తున్న పోలీసు అధికారులు

దుర్గమ్మ... పాహిమాం

- ఘనంగా దసరా ఉత్సవాలు
- భక్తులతో కళకళలాడిన ఆలయాలు
- గ్రామాల్లో భారీ అన్నసమారాధనలు
- తరలివచ్చిన భక్తజనం



ప్రత్యేకాలంకరణలో కనకదుర్గ అమ్మవారు

పెదబయలు: దేవి శరనవరాత్రి మహోత్సవాలు మన్యంలో వైభవంగా జరిగాయి. ప్రతి గ్రామంలో దసరా వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఇళ్లను మామిడితోరణాలు, పసుపు, కుంకుమలతో అందంగా అలంకరించారు. అమ్మవారి ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. దుర్గమ్మకు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమలు, పండ్లు, పూలు, నూతన వస్త్రాలు, గాజులు సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భవానీ భక్తులు అమ్మవారికి ప్రత్యేక హోమాలు, అభిషేకాలు జరిపారు. వాహనాలను అలంకరించి పూజలు చేశారు. భక్తులు అగ్ని గుండాన్ని తొక్కారు. పోలీసు స్టేషన్‌లలో ఆయుధ పూజ నిర్వహించారు. దుర్గమ్మ నామస్మరణతో గ్రామాలన్నీ మార్మోగాయి. పెదబయలు మండల కేంద్రంలో హరిహరపుత్ర మోటార్ యూనియన్ ఆధ్వర్యంలో దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారిని ఊరేగించారు. దుంబ్రిగుడకు చెందిన భక్తుడు కమ్మిడి నిర్మల ఆర్థిసాయంతో భారీ అన్నసమారాధన జరిగింది. మోటర్ యూనియన్ నాయకులు చెండా నీలయ్య,పాంగి సింహాచలం,మండి కిశోర్, వైఎస్సార్ సీపీ నాయకులు సూరయ్య, వర్తకులు తదితరులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: మండలంలోని అరకు సంతబయలు గ్రామంలో దసరా పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరిగింది.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని దుర్గాదేవి ఆలయ సమీపంలో మోటార్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా దసరా వేడుకలు జరిగాయి. జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, నరసింహమూర్తి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. జోలాపుట్టు, దార్రెల, కర్రిముఖిపుట్టు, మాకవరం, కిలగాడ, చెరువుపాకల గ్రామాల్లో దసరా పండుగను గిరిజన సంప్రదాయాల ప్రకారం ఘనంగా జరుపుకున్నారు. థింసా నృత్యాలతో సందడి చేశారు.

వీఆర్ పురం: మండల కేంద్రం రేఖపల్లి కోటమైసమ్మ అమ్మవారి ఆలయం, చొప్పలి గ్రామాల్లో భారీ అన్నదాన సమారాధన జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. చొప్పల్లి ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

జి.మాడుగుల: మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది భక్తిశ్రద్ధలతో ఆయుధపూజ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి పీఠం వద్ద వేదమంత్రోచ్ఛరణలతో దుర్గమ్మకు అభిషకాలు, హోమం నిర్వహించారు. భారీ అన్న సమారాధన జరిపారు. భవానీ భక్తులు అగ్నిగుండం తొక్కారు. మండలంలో గల ప్రజలు వాహన పూజ, శమీ పూజా కార్యక్రమం నిర్వహించారు. దుర్గమ్మ తల్లిని మేళ తాళాలు, డప్పు వాయిద్యాలు, కోలాటాలు, విచిత్ర వేషధారణ నడుమ పురవీధులలో ఊరేగింపుగా తీసుకెళ్లి సమీపంలోని గెడ్డలో నిమజ్జనం కార్యక్రమం నిర్వహించారు.

రాజవొమ్మంగి: మండలంలోని దూసరపాము, రాజవొమ్మంగి, జడ్డంగి, చెరకుంపాలెం, వైకుంఠపురం తదితర గ్రామాల్లో దసరా ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. దసరా ఉత్సవాల్లో భాగంగా చిన్నారుల కోలాటనృత్యాలు అలరించాయి. జడ్డంగి పోలీసు స్టేషన్‌లో అడిషనల్ ఎస్ఐ ఎంఎస్ఎస్. రాజు ఆధ్వర్యంలో ఆయుధ పూజ చేశారు.

వై.రామవరం: చవిటిదిబ్బలు గ్రామంలో విజయదశమి వేడుకలు ఘనంగా జరిగాయి. అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో కుంకుమపూజలు నిర్వహించారు. భక్తులు అగ్నిగుండాన్ని తొక్కారు. మహిళల కోలాటం ఆకట్టుకుంది. స్థానిక పోలీసుస్టేషన్‌లో సీఆర్‌పీఎఫ్ డి–42 బెటాలియన్ సీఐ వెంకటరమణ ఆధ్వర్యంలో ఆయుధ పూజ నిర్వహించారు. పలువురు ప్రముఖులకు, విద్యార్థులకు భోజన ప్రసాదాలు అందించారు. ఎస్ఐ ఎం.సంతోష్‌కుమార్, అడిషనల్ ఎస్ఐ కె.రాంబాబు పాల్గొన్నారు.



దూసరపాము ఆలయంలో ప్రత్యేకాలంకరణలో అమ్మవారు



జి.మాడుగుల పోలీసుస్టేషన్‌లో ఆయుధ పూజ చేస్తున్న పోలీసులు



దుర్గమ్మ పీఠం వద్ద పూజలు నిర్వహిస్తున్న భవానీ మాలధారులు



రాజవొమ్మంగిలో చిన్నారుల కోలాటం



ఆలయం వద్ద కోలాటం ఆడుతున్న ఆలయ కమిటీ మహిళా సభ్యులు



చవిటిదిబ్బలు కనకదుర్గమ్మ ఆలయం వద్ద అగ్నిగుండాన్ని తొక్కుతున్న భక్తులు



వై.రామవరం పోలీసు స్టేషన్‌లో ఆయుధపూజ

పోలీసు అమరవీరులకు ఘన నివాళి



దుంబ్రిగుడలో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న పోలీసులు



వై.రామవరంలో కొవ్వొత్తులతో మానవహారం చేస్తున్న పోలీసులు

దుంబ్రిగుడ: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో ఎస్ఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అమరులకు నివాళులర్పించారు.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ఎస్ఐ రవీంద్ర ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. విధుల నిర్వహిస్తూ అసువులు బాసిన పోలీసు అమరవీరులకు ఘనంగా నిర్వహించారు. వారి సేవలు, త్యాగాలకు జోహార్లు అంటూ పలు నినాదాలు చేశారు. సీఆర్‌పీఎఫ్ పోలీసులు,సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

కూనవరం: దేశరక్షణ, ప్రజారక్షణలో సమిధులైన అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం ద్వారా వారి కుటుంబాల పట్ల ప్రత్యేక గౌరవం భావం పెంపొందుతుందని ఎస్ఐ బి.వెంకటేశ్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో సోమవారం పోలీసులు ర్యాలీ నిర్వహించారు.

వై.రామవరం: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఎస్ఐ ఎం.సంతోష్ కుమార్, సిఆర్‌పీఎఫ్ డీ42 బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. స్థానిక బస్టాండు ఆవరణలో మానవహారం నిర్వహించి పోలీసు అమరవీరుల త్యాగాలను వివరించారు. అడిషనల్ ఎస్ఐ కె.రాంబాబు, సిబ్బంది, సిఆర్‌పీఎఫ్ డీ42 బెటాలియన్ అదనపు బలగాల సిబ్బంది పాల్గొన్నారు.

రంపచోడవరం: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో ఎస్ఐ సురేష్‌బాబు ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



కూనవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



ముంచంగిపుట్టులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

వాలీబాల్ టోర్నీ విజేత కుంజవారిగూడెం

వీఆర్ పురం: కొమరం భీమ్ యూత్ ఆధ్వర్యంలో కుంజవారిగూడెంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌లో కుంజవారిగూడెం టీమ్ విజేతగా నిలిచి ప్రథమ బహుమతి రూ.20 వేలు కైవసం చేసుకుంది. స్థానిక గ్రామంలో ఈ నెల 21నుంచి 22 వ తేదీ వరకు నాలుగు విలీన మండాలాల స్థాయిలో వాలీబాల్ టోర్నమెంట్ జరిగింది. టోర్నీలో వివిధ మండలాలకు చెందిన 30 టీములు పాల్గొన్నాయి. చివరిగా కుంజవారిగూడెం, చొప్పల్లి జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. చొప్పల్లి టీమ్‌పై కుంజవారిగూడెం జట్టు విజయం సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. జట్టుకు మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య జ్ఞాపకార్థం సీపీఎం నాయకులు రూ.20 వేలు అందచేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన చొప్పల్లి జట్టుకు ఏఎస్‌డీఎస్ సంస్థ డైరెక్టర్ ఉండవల్లి గాంధీబాబు రూ.15 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వేగితోట టీమ్‌కు ఉపాధ్యాయుడు జల్లి బాబూరావు, విద్యుత్ శాఖ ఏఈ కణితి గణేష్‌లు రూ.10 వేలు అందచేశారు. ఎంపీపీ కారం లక్ష్మి , సర్పంచ్ మారయ్య, పూనెం సత్యనారాయణ , సోయం చిన్నబాబు, కుంజా అర్జమ్మ , రవ్వ సుజాత , పెంటయ్య, కొమరం భీమ్ యూత్ సభ్యులు రమేష్ , సతీష్, బొజ్జి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి చేయూత

కొయ్యూరు: మండలంలోని మర్రివాడ పంచాయతీ పిడతమామిడిలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితుడు సుర్ల బాలకృష్ణ కుటుంబానికి తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న దుమంతి సత్యనారాయణ ఆపన్నహస్తం అందించారు. బాధిత కుటుంబానికి దుస్తులు, రగ్గులు, జంబుఖానాలు, బియ్యం తదితర సామగ్రి పంపిణీ చేశారు. బాధితుడు బాలకృష్ణ మాట్లాడుతూ ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్లు కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి వాటిని అందజేయాలని కోరారు. సర్పంచ్ మాదల సత్యవతి చిన్నారావు పాల్గొన్నారు. బాధిత కుటుంబానికి కొయ్యూరుకు చెందిన ఎం.వి.వి.ప్రసాద్, చిరంజీవి, చిన్న, రాము, బషీర్‌ఖాన్, బూర్గులయ్యా బాధితుడిని పరామర్శించి నిత్యావసరాలను, ఆర్థిక సాయాన్ని అందజేశారు.



బాధిత కుటుంబానికి నిత్యావసరాలు, దుస్తులు అందజేస్తున్న దాత సత్యనారాయణ, సర్పంచ్

తప్పుడు ఆరోపణలు మానుకోవాలి

మారేడుమిల్లి : ఏజెన్సీలోని వాల్మీకి తెగపై కొంత మంది తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, ఇది తగదని మండల వాల్మీకి సంఘం నాయకులు మంగళవారం తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ వాల్మీకి తెగకు చెందిన వారు రాజవోమ్మంగి మండలంలో తర, తరాలుగా జీవిస్తూ, స్థిరాస్తి పొంది ఉన్నట్టు పేర్కొన్నారు.

జెడ్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీబాబు, సర్పంచ్ కొండా జాకబ్, వైస్ ఎంపీపీ రవికుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు అనిల్ ప్రసాద్ (బాబీ), మండల వాల్మీకి సంఘం అధ్యక్షుడు అనిదీప్ కుమార్, కార్యదర్శి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మన్యప్రాంతంలో అనాదిగా నివసిస్తున్న వాల్మీకి కులస్తులపై తప్పుడు ప్రచారం తగదని వాల్మీకి సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు వాసా సత్యనారాయ ణ అన్నారు. ఆయన మంగళవారం రాజ వొమ్మంగిలో విలేకరులతో మాట్లాడుతూ కొంతమంది కావాలనే తప్పుడు ప్రచా రం చేస్తున్నారని అన్నారు. వాల్మీకుల మనోభావాలు దెబ్బతినేలా ఎవరు ఆరోపణలు చేసినా సహించేది లేదని ఆయన హెచ్చరించారు.

ఘనంగా షిర్డీ సాయి పుణ్యతిథి మహోత్సవాలు

అనకాపల్లి రూరల్: కొత్తూరు మేజర్ పంచాయతీ శారదానగర్ షిర్డీ సాయిబాబా మందిరంలో మంగళవారం షిర్డీ సాయినాథుని పుణ్యతిథి మహోత్సవాలు ఘనంగా జరిగాయి. షిర్డీలో మాదిరిగా బాబా నమూనా సమాధిని పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు, పారాయణం చేశారు. అభిషేకాలు,అర్చనలు చేసిన అనంతరం కాగడా హారతి ఇచ్చారు. మంగళవారం ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి బాబాను దర్శించుకున్నారు.ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేశారు.సాయంత్రం బాబా మందిరంలో చేసిన దీపాలంకరణలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

కశింకోట: స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయ దశమి రోజున సాయిబాబా సమాధి అయ్యారు. ఈ సందర్భంగా ఆలయాన్ని అందంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త గొంతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.



ప్రత్యేకాలంకరణలో సాయిబాబా

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సారె

పరవాడ: స్థానిక బొంకుల దిబ్బ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని సోమవారం అమ్మవారి సారె ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భవానీ భక్తులు, సేవకులు ఆధ్వర్యంలో డప్పు వాయిద్యాలు నడుమ పురవీధుల్లో ఊరేగించారు. వివిధ రకాల పిండి వంటలతో పాటు రకరాల స్వీట్లను అమ్మవారికి భక్తి శ్రద్ధలతో సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకటపద్మల క్ష్మీశ్రీనివాసరావు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, పెద్ద చెరువు రైతు సంఘ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పైల వెంకటరావు, వర్రి లక్ష్మి, పైల పైడింనాయుడు, సీహెచ్.శ్రీనివాసరావు, భవానీ భక్తులు, సేవకులు పాల్గొన్నారు.



సారె ఊరేగింపులో భక్తులు

సినీనటుడు ప్రభాస్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఫ్యాన్స్

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో సోమవారం రాత్రి సినీనటుడు ప్రభాస్ జన్మదిన వేడుకలను క్లబ్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. కార్యక్రమంలో ఫ్యాన్స్ కేక్‌ను కట్ చేసి సందడి చేశారు. ఉదయ్, మురళి, సురేష్, అజయ్, గుండు, రవి తదితరులు పాల్గొన్నారు.

మ్యాచ్ ఆడి.. స్నేహితుడికి నివాళి



గంగవరంలో అమీర్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న స్నేహితులు

గంగవరం: మండల కేంద్రంలోని పాత బ్యాంకు వీధికి చెందిన అమీర్ బాషా(18) అనారోగ్యంతో ఈనెల 22న మృతి చెందాడు. మండల స్థాయి క్రికెట్ పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొనే వాడని, సహచరులకు తన వంతు సాయం అందించే వాడని పలువురు స్నేహితులు అమీర్ సేవలను గుర్తు చేశారు. ఈ సందర్భంగా క్రికెట్ టీమ్ సభ్యులు జెర్సీ ధరించి, అమీర్ సమాధి వద్ద నివాళులర్పించారు. అనంతరం స్థానిక మైదానంలో టెస్ట్ మ్యాచ్‌ను ఆడి సంతాపం తెలిపారు.